# సదస్సు

<u>వేదిక :</u>

**జిల్లా గ్రంథాలయం,**
**5/3, అరండల్ పేట, గుంటూరు**

<u>తేది, సమయం :</u>

**ఫిబ్రవరి 22, 2015 ఆదివారం**
**సాయంత్రం 4 గంటలకు**

<u>సభాధ్యక్షులు :</u>

**అమర్తలూరి రత్నప్రసాద్,** న్యాయవాది

<u>వక్తలు :</u>

**వడ్డే శోభనాద్రీశ్వరరావు**
మాజీ మంత్రివర్యులు

**ఆచార్య సి. రామచంద్రయ్య**
ఫ్యాకల్టీ, అర్బన్ స్టడీస్, సెంటర్ ఫర్ ఎకనామిక్ & సోషల్ స్టడీస్, హైద్రాబాద్

**కె. రవి కుమార్**
భూ సమస్యల పరిశోధకుడు, హైకోర్టు న్యాయవాది

**డాక్టర్ కె. బాబూరావు**
పర్యావరణ వేత్త

**వి.యస్. కృష్ణ**
ప్రధాన కార్యదర్శి, మానవ హక్కుల వేదిక.

***<u>అందరూ ఆహ్వానితులే</u>***

**మానవ హక్కుల వేదిక,**
**HUMAN RIGHTS FORUM (HRF)**
**కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల సంయుక్త కమిటి.**

ప్రచురణ కర్త : జి.యస్. నాగేశ్వరరావు, మానవహక్కుల వేదిక.



# ప్రపంచ స్థాయి రాజధాని పేరుతో ప్రజా జీవన విధ్వంసం

## <u>ఫిబ్రవరి 22న గుంటూరులో సదస్సు</u>

నవ్యాంధ్ర ప్రదేశ్‌కు రాజధాని నిర్మాణం అవసరమే. దాన్ని ఎవరూ వ్యతిరేకించటం లేదు. రాజధానిని ఎక్కడ ఎలా నిర్మించాలి అనేదే అసలు సమస్య. ఆ సమస్యను అన్ని కోణాల నుండి అధ్యయనం చేయటానికి శివరామకృష్ణన్ కమిటీ వేశారు. రాజధాని నిర్మాణానికి సారవంతమైన వ్యవసాయ భూముల్ని సేకరిస్తే, అది ఆహార భద్రతకూ, పర్యావరణానికీ హానికారిగా మారుతుందనీ, రైతులూ, వ్యవసాయ కూలీలూ పెద్ద ఎత్తున విస్థాపనకు గురౌతారనీ శివరామకృష్ణన్ కమిటీ అభిప్రాయపడింది. శివరామకృష్ణన్ కమిటీ కొంతమేరకైనా వివిధ వర్గాల ప్రజలను సంప్రదించింది. అభిప్రాయ సేకరణ జరిపింది. వాటి ఆధారంగా కొన్ని ప్రతిపాదనలు, ప్రత్యామ్నాయాలు ప్రభుత్వం ముందు ఉంచింది. చంద్రబాబు వాటన్నింటిని అప్రజాస్వామికంగా తిరస్కరించాడు. తిరస్కరించడానికి దారితీసిన కారణాలు కూడా ప్రజలముందు ఉంచలేదు. శివరామకృష్ణన్ కమిటీ నివేదికపై ఎలాంటి చర్చా జరపలేదు. సంవత్సరానికి మూడు పంటలుపండే జరీబు భూములున్న ప్రాంతాన్ని ఏ ప్రాతిపదికమీద రాజధాని కోసం సమీకరించాలనుకున్నారో ఎక్కడా తెలియపరచలేదు. స్వచ్ఛందంగా భూములివ్వటానికి ముందుకు రాకపోతే బలవంతంగానైనా సేకరిస్తాం అని బెదిరింపులకు పాల్పడుతూ, ప్రభుత్వం అప్రజాస్వామికంగా, ఏకపక్షంగా భూసమీకరణ ప్రక్రియను చేపట్టింది. తుళ్ళూరు ప్రాంతంలో సుమారు 52000 ఎకరాల వ్యవసాయ భూముల్ని సేకరించటానికి కంకణం కట్టుకుంది. మరో 50000 ఎకరాలను రెండవ దశలో సేకరిస్తానంటున్నది. మొత్తం లక్ష ఎకరాల్లో ప్రపంచస్థాయి రాజధానిని నిర్మిస్తానంటున్నది. భారీగా సేకరిస్తున్న భూమిని ఏఏ అవసరాలకు ఎవరెవరికి ఎంతెంత కేటాయిస్తారో చెప్పటంలేదు.

12000 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చండీగడ్‌లో కోర్ క్యాపిటల్‌ను 750 ఎకరాల్లోనే నిర్మించగలిగారు. 5000 నుండి 10000 ఎకరాల్లోనే రాజధానిని నిర్మించుకోవచ్చు. చంద్రబాబు అభీష్టానికి అనుగుణంగా విజయవాడ–గుంటూరుల మధ్యే రాజధానిని నిర్మించాలనుకున్నప్పటికీ, ఆరెండు నగరాల మధ్య లభ్యంగా వున్న 10000 ఎకరాల భూమి రాజధాని అవసరాలకు సరిపోతుంది. తుళ్ళూరు ప్రాంతంలో వ్యవసాయ భూముల్ని సేకరించాల్సిన

అవసరమేలేదు. చంద్రబాబు చెపుతున్న విధంగా రాజధాని నిర్మించాలంటే లక్ష కోట్ల రూపాయలుకు పైగా నిధులు కావాల్సి ఉంటుంది. నిధుల కొరత మూలంగా తన ప్రధాన ఎన్నికల హామీ రుణమాఫీ పథకాన్ని రకరకాల సాకులతో నీరుగార్చుతున్న చంద్రబాబు, తల్లక్రిందులుగా తపస్సు చేసినా లక్ష కోట్ల రూపాయలు సమీకరించలేడు. సేకరించిన భూముల్లో సగం భూముల్ని వేలం వేసి నిధులు సమీకరించుకోవటం తప్ప వేరే మార్గం లేదు. లేదా సామాజిక అవసరాలకు, రహదార్లకు, డ్రైయిన్లకు పోను, మిగిలిన భూముల్లో సగం భూములు కార్పొరేటు సంస్థలకు, మల్టీ నేషనల్ కంపెనీలకు కట్టబెట్టి, ప్రభుత్వం దగ్గర ఉన్న భూముల్లో రాజధానిని నిర్మించే బాధ్యతను వాటికి అప్పగించాల్సి ఉంటుంది. వాటికి లాభాల పంటలు పండించటానికే లక్ష ఎకరాల పంట భూములను రైతుల నుండి సేకరించటానికి ప్రభుత్వం నిర్ణయించింది.

రాయలసీమ, ఉత్తరాంధ్ర లాంటి వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధికి ఇవ్వాల్సినంత ప్రాధాన్యం ఇవ్వకుండా, ఇప్పటికే అభివృద్ధి చెందిన కృష్ణా, గుంటూరు జిల్లాలను మరింతగా అభివృద్ధి చేసే విధానాలను చంద్రబాబు అవలంబిస్తున్నాడు. దీని మూలంగా ప్రాంతీయ అసమానతలు మరింత పెరుగుతాయి. అలా కాకుండా అన్ని ప్రాంతాలకు ప్రయోజనం జరగాలంటే, పాలనా యంత్రాంగం విధులూ, కార్యాలయాలూ వికేంద్రీకరణ జరగాలి. అభివృద్ధిని ఒకే ప్రాంతంలో కేంద్రీకరించటం ఏ విధంగానూ సమర్ధనీయం కాదు.

రైతుల భూములు పోతే, ఆ గ్రామాల్లోని భూముల్లేని వ్యవసాయ కూలీల, కౌలు రైతుల జీవనం కూడా పోతుంది. చేతి వృత్తుల, సేవక కులాల ప్రజల జీవనం కూడా పోతుంది. భూములు కోల్పోయేది అగ్రకులాల వాళ్ళయితే, జీవనం కోల్పోయేది మాత్రం బి.సి., ఎస్.సి., ఎస్.టి., మైనారిటీలు. భూములు కోల్పోయిన వాళ్ళకు ఇళ్ళ స్థలాలు, వాణిజ్య స్థలాలు కేటాయిస్తారు. కాబట్టి వాళ్ళకు భవిష్యత్తులో ఎంతోకొంత ఆర్ధికపరమైన ఆసరా ఉంటుంది. కాని భూముల్లేని వ్యవసాయ కూలీలు, ఎలాంటి అధికారిక గుర్తింపూ లేని కౌలుదార్ల పరిస్థితి ఏంటి? వ్యవసాయ పనులుతప్ప మరో పని చేతకాని వీళ్ళు ఎట్లా బ్రతకాలి? నూతన రాజధానిలో వీళ్ళు ఏరోజు పనులు ఆరోజు వెతుక్కునే అడ్డాకూలీల స్థితికి నెట్టబడతారు. నూతన రాజధానిలో జీవన వ్యయం అనేకరెట్లు పెరుగుతుంది. దాని మూలంగా వాళ్ళ జీవన ప్రమాణాలు ఇప్పుడున్న వాటికంటే దారుణంగా పడిపోతాయి. నగరీకరణ మూలంగా సామాజిక జీవనం కోల్పోయి, తీవ్రమైన అభద్రతకూ, అశాంతికీ గురౌతారు. వాళ్ళ జీవితాలు ధ్వంసం అవుతాయి. ఆ విధ్వంసం నుండి వాళ్ళను కాపాడటానికి కుటుంబానికి నెలకు రూ. 2,500/-లు ఫించను ఇస్తామనీ, శిక్షణాకేంద్రాలు నెలకొల్పి వాళ్ళలో నైపుణ్యాలను వృద్ధిచేస్తామనీ చంద్రబాబు హామీలు గుప్పిస్తున్నాడు. వట్టి హామీలు తప్ప, చట్టపరమైన గ్యారంటీ ఇవ్వటం లేదు.

క్రొత్త రాజధానిలో వెలిసే కార్పొరేట్ కార్యాలయాల్లో, ఫ్యాక్టరీల్లో రిజర్వేషన్‌లు వుండవు. స్థానికులనే తీసుకోవాలనే నిబంధనలు చెల్లవు. ప్రైవేటురంగం కాబట్టి దేశం మొత్తం మీద ఏ ప్రాంతం వాళ్ళనైనా నియామకాలు చేసుకోవచ్చు. అగ్రకులాలకు మాత్రమే ఉద్యోగావకాశాలు ఉంటాయి. భూ సమీకరణ జరుగుతున్న 29 గ్రామాల్లోని అణగారిన కులాల వాళ్ళకు వందల సంఖ్యలో కూడా ఉద్యోగాలు వచ్చే అవకాశం లేదు.

ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం ద్వారా చంద్రబాబు సృష్టించదలచుకున్న సంపద, కార్పొరేట్ సంస్థలకు, బహుళజాతి కంపెనీలకు మాత్రమే అనుభవంలోకి వస్తుంది. ఆ సంపద సాధారణ ప్రజలకు మాత్రం అందనంత దూరంలోనే ఉండిపోతుంది. ప్రాంతీయ అసమానతలూ, ప్రజల మధ్య ఆర్ధిక అసమానతలూ మరింత తీవ్రమౌతాయి. అది రాజ్యాంగ విలువలకు విరుద్ధం. పంట భూములను వ్యవసాయేతర అవసరాలకు మళ్ళించటం 2013 భూ సేకరణ చట్టానికి విరుద్ధం. అసలు ల్యాండ్ పూలింగ్ విధానమే రాజ్యాంగం లోని 300-ఎ అధికరణకు విరుద్ధం.

హైద్రాబాద్ కోల్పోవటం సీమాంధ్ర ప్రజలకు పూడ్చుకోలేని నష్టమనీ, పెను విపత్తు అనీ, ప్రధాన స్రవంతి రాజకీయ పక్షాలు రాష్ట్ర విభజన సందర్భంగా ప్రచారం చేశాయి. ప్రజల్లో ఆ భావనను పెంచి పోషించాయి. చంద్రబాబు దాన్ని అవకాశంగా తీసుకొని, ప్రజామోదం సులభంగా పొందటానికి హైద్రాబాద్‌ను మించిన రాజధాని నగరాన్ని సృష్టిస్తానని ఊదరగొడుతున్నాడు. హైద్రాబాద్‌ను మించిన నగరం అంటే ఏమిటి ? పచ్చని పొలాలను కాంక్రీట్ వనాలుగా మార్చటమా ? స్వచ్ఛమైన గాలికి బదులుగా వాహనాలు వదిలే విష వాయువులతో కలుషితం చేయ్యటమా ? ప్రజలను వాళ్ళ జీవనోపాధికి దూరం చేసి చెల్లాచెదురు చెయ్యటమా ?

చంద్రబాబు అనుసరిస్తున్న ఈ అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్న **సదస్సుకు** రావలిసిందిగా మిమ్ముల్ని ఆహ్వానిస్తున్నాం.